సాక్షి
హైదరాబాద్, శనివారం, 5, అక్టోబర్, 2024

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: హిమాయత్‌సాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్నట్లు ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కాళీమందిర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి 11.30 వరకు సంజయ్‌గాంధీనగర్, సంఘంసిటీ, ఇండస్ వ్యాలీ, బైరాగిగూడ, శివపురి, శివసాయినగర్ ఫేస్–1,2, సుబ్రహ్మణ్యకాలనీ, హైదర్షాకోట్ ఫీడర్ పరిధిలో 11.30 నుంచి 12 గంటల వరకు వెంకటేశ్వర కాలనీ, డైమండ్ వ్యాలీ, ప్రశాంత్‌నగర్, తిరుమల గార్డెన్, రాధారిపెట్స్ ఫేస్–2, పావనీ హార్మనీ విల్లాస్, బచ్‌పన్ స్కూల్, పార్ట్ ఆఫ్ పద్మశ్రీహిల్స్ మెయిన్ రోడ్డు, భాగ్యనగర్ ఫీడర్ పరిధిలో 12 నుంచి 12.30 వరకు రాధానగర్, నర్సారెడ్డి కాలనీ, పద్మశ్రీహిల్స్, భాగ్యనగర్ కాలనీ, కె.కె–3, రాధానగర్ ఫేస్–1, హీరా కాలనీ, ఇంద్రారెడ్డినగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో మరమ్మత్తుల కారణంగా కోతలు విధిస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి ఎమ్మెల్యే అభినందన



శంషాబాద్: పట్టణంలోని సాతంరాయిలోని దళిత కుటుంబానికి చెందిన భార్గవి నీట్ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకుతో ఎంబీబీఎస్ సీటు సాధించడంతో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అభినందించారు. సీనియర్ నాయకులు సంతోష్ గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసిన విద్యార్థికి అభినందనలు తెలుపుతూ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సునీత దయానంద్, రమేష్, చంద్రయ్య, సతీష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు తరలింపు

రాజేంద్రనగర్: మూసీ రివర్‌బెడ్ కింద గుర్తించిన మరో మూడు కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లల్లోకి తరలించినట్లు ఎమ్మార్వో రాములు తెలిపారు. శుక్రవారం వరకు మొత్తం 25 కుటుంబాలను డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు పంపించామని, సామాగ్రి తరలింపులకు పూర్తిగా సహకరిస్తున్నామన్నారు. ఒక్కో కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న రూ. 25 వేల రూపాయల నగదును అందజేశామని తెలిపారు. స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఇళ్లను ఖాళీ చేస్తున్న వారికి నార్సింగి, జియగూడ ప్రాంతాల్లోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయిస్తున్నామని తెలిపారు.

కార్మికుల పక్షాన నిలబడి పనిచేయాలి: జంగయ్య



సమావేశంలో పాల్గొన్న సీపీఎం పార్టీ నాయకులు

రాజేంద్రనగర్: సీపీఎం పార్టీ అంటే బడుగు, బలహీన వర్గాలకు, పేద ప్రజలు, కార్మికులకు అండగా ఉండి పని చేస్తుందని సీపీఎం పార్టీ కార్యదర్శి జంగయ్య అన్నారు. రాజేంద్రనగర్‌లో పార్టీ శాఖ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. పార్టీ సభ్యులు కార్మికుల పక్షాన నిలబడి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ, యాదయ్య, శ్రీలత, చిట్టెమ్మ, అనిత, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసానికి కరాటే దోహదం: మాస్టర్



కరాటే కోచింగ్ సెంటర్ ప్రారంభోత్సవంలో స్థానిక నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి: కరాటే అభ్యసించడం ద్వారా ఆత్మవిశ్వాసంతో పాటు శారీరక దృఢత్వం వృద్ధి చెందుతుందని వారియర్స్ కరాటే గ్రాండ్ మాస్టర్ బాలేశ్వర్ అన్నారు. టీఎన్జీవోస్ కాలనీలో నూతనంగా వారియర్స్ కరాటే క్లాసులను ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలేశ్వర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు కరాటే నేర్చుకోవడం వల్ల అనేక లాభాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 6గంటల నుంచి 7.30 గంటల వరకు కరాటే శిక్షణను క్రిష్ణ మాస్టర్ నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రేమ్‌గౌడ్, వెంకటేష్, యాదగిరి, కరాటే మాస్టర్లు విక్రమ్, మల్లేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



రఘువీరా భక్త సమాజంలో అమ్మవారి పూజల్లో భక్తులు



హైదర్‌గూడ నేతాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో.. అధ్యక్షులు వెంకటేష్ తదితరులు



కాటేదాన్ హౌసింగ్ బోర్డ్ కాలనీలో అమ్మవారి పూజల్లో అడికె రాజు

అత్తాపూర్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు డివిజన్ పరిధిలో రెండవ రోజు ఘనంగా జరిగాయి. దేవాలయాల వద్ద ప్రతిష్ఠించిన అమ్మవారిని దర్శించుకునేందుకు తెల్లవారు జామునుంచే భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు నిర్వహించారు. మైలార్‌దేవ్‌పల్లిలో నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కాటేదాన్ హౌసింగ్‌బోర్డు కాలనీలో శుక్రవారం అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చ నాయకులు అడికె రాజు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో పాటు కాలనీ వాసులు బోలా సింగ్, మురారి, రవి తదితరులు పాల్గొన్నారు.



నాగలింగేశ్వరాలయంలో గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు



పూజా కార్యక్రమంలో భక్తులు

వైభవంగా నవరాత్రి ఉత్సవాలు...

శంషాబాద్: శంషాబాద్‌లో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పట్టణంలోని కాపుగడ్డ నాగలింగేశ్వరాలయంలో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. అమ్మవారికి అభిషేకం, గణపతిపూజ, గౌరిపూజ, నవగ్రహ, కలశపూజ, లలితా సహస్రనామం, కుంకుమార్చన కార్యక్రమాలను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ధర్మగిరిలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. నిత్యం హోమం, పారాయణం కార్యక్రమాలతో పాటు అన్నప్రసాదం అందజేశారు.



పోచమ్మ తల్లి ఆలయంలో నవరాత్రి పూజల్లో భక్తులు



గాయత్రీదేవి రూపంలో కోట మైసమ్మ అమ్మవారు



నెక్నాంపూర్ కమ్యూనిటీహాల్ నవరాత్రి ఉత్సవాలలో గ్రామస్థులు

అంగరంగవైభవంగా నవరాత్రి వేడుకలు..

మణికొండ: మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో పలు దేవాలయాలలో నెలకొల్పిన అమ్మవారి ప్రతిమలతో పాటు మణికొండ భాగ్యలక్ష్మి కాలనీ దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. రాత్రి భజనలు, జాగరణలు, మధ్యాహ్నం అన్నదానాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. నవరాత్రులలో రెండవ రోజు అమ్మవారిని గాయత్రీమాతగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నార్సింగిలో జరిగిన పూజలో కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు అశోక్‌యాదవ్‌తో పాటు నాయకులు పాల్గొన్నారు.



బుద్వేల్ కోట మైసమ్మ ఆలయంలో పూజలు



మణికొండ శివాలయంలో.. వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, తదితరులు



నార్సింగి అమ్మవారి పూజలో కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్, నాయకులు

అత్తాపూర్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నాం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సంగీతగౌరీశంకర్

అత్తాపూర్: డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిద్దాలనే లక్ష్యంతో ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులను చేపడుతున్నామని డివిజన్ కార్పొరేటర్ సంగీతగౌరీశంకర్ సూచించారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని సిరిమల్లెనగర్ ప్రధాన రహదారిపై 5 లక్షలతో సీసీ రోడ్డు పనులతో పాటు జలాల్ బాబానగర్‌లో 11 లక్షలతో పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అత్తాపూర్ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిద్దాలన్న లక్ష్యంతో ఆయా సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే దశల వారిగా అధికారులతో చర్చించి పనులను పూర్తి చేయిస్తామన్నారు. సీసీ రోడ్డు పనులలో ఎటువంటి నాణ్యత లోపాలు లేకుండా చూడాలని కాంట్రాక్టర్‌ను, అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ నర్సింహ్మమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, బీజేపీ నాయకులు సిద్దేశ్వర్, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే ప్రజల అభ్యున్నతి



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొక్క నర్సింహ్మారెడ్డి తదితరులు

అత్తాపూర్: దేశంలోని అన్నీ వర్గాల ప్రజల అభ్యున్నతికి ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని రంగారెడ్డి జిల్లా రూరల్ బీజేపీ అధ్యక్షులు బొక్క నర్సింహ్మారెడ్డి అన్నారు. బీజేపీ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం హైదర్‌గూడ చౌరస్తాలో నిర్వహించారు. డివిజన్ బీజేపీ అధ్యక్షులు సాబాద విజయ్‌కుమార్ అధ్యక్షతన బూత్ నెంబర్ 228లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి బొక్క నర్సింహ్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ప్రజలను 8800002024 నెంబర్‌కు మిస్ కాల్ ఇచ్చి, యాప్ ద్వారా బీజేపీ మెంబర్ షిప్ ఇప్పించడం జరిగింది. ఈ సందర్భంగా బొక్క నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి బూతులో 200లకు పైగా సభ్యత్వం తప్పకుండా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి, జిల్లా సభ్యత్వ కోకన్వీనర్ కొమురయ్య, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలిక



మణికొండ: ఇంటి ముందు ఆడుకుంటూ తప్పిపోయిన ఓ బాలికను నార్సింగి పోలీసులు గంటల వ్యవధిలోనే గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. మున్సిపాలిటీ అలకాపూర్ టౌన్‌షిప్‌లో ఉంటున్న 5 సంవత్సరాల పాప తనూజా గురువారం రాత్రి కనిపించకుండా పోయింది. తల్లిదండ్రులు చుట్టు పక్కల వెతికినా ప్రయోజనం లేకపోవటంతో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంశీ, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డికి విషయం తెలిపారు. దీంతో వారు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన ఎస్‌ఐ సరిత ఆధ్వర్యంలో పోలీసు బృందం గాలింపు చర్యలు చేపట్టి సీసీ కెమెరాలను పరిశోధించగా, బాలిక ఆచూకీ గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసుల పనితీరు పట్ల అలకాపూర్ టౌన్‌షిప్ సంక్షేమ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

దేవాలయాలు శక్తి కేంద్రాలు

మణికొండ: దేవాలయాలు సమాజానికి శక్తి కేంద్రాలని వాటిని నిర్మించుకోవటంతో పాటు తరచూ సందర్శించాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మణికొండ మున్సిపాలిటీ, వెంకటేశ్వర కాలనీలో ఉపేంద్రనాథ్‌రెడ్డి నిర్మించిన గాయత్రీదేవి ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. దేవాలయాల్లోని విగ్రహాల్లో శక్తి వచ్చేలా పూజలు నిర్వహిస్తారని వాటిని దర్శించుకుంటే మానసిక ప్రశాంతత వస్తుందన్నారు. అనంతరం బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కార్తిక్‌రెడ్డి గాయత్రీమాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, బీజేపీ అధ్యక్షుడు బీరప్ప, కౌన్సిలర్లు, పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గాయత్రీమాత ప్రతిష్ఠాపన పూజల్లో ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి



గాయత్రీమాత ప్రతిష్ఠాపన పూజల్లో కార్తిక్‌రెడ్డి తదితరులు

రోడ్డు పూర్తి చేయాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నర్సింహా

శంషాబాద్ రూరల్: మండలంలోని పాల్మాకుల–ముచ్చింతల్ రోడ్డును పూర్తి చేసి స్థానికులకు అందుబాటులోకి తీసుకురావాలని ఎస్సీ,ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు చిలకమర్రి నర్సింహా శుక్రవారం కలెక్టరు శశాంక్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో ఈ రోడ్డు ఏర్పాటు కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు చేపట్టలేదన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలి, రోడ్డు పూర్తి చేస్తే సమీప గ్రామాల ప్రజలకు దూరభారం తగ్గుతుందని తెలిపారు.

ఘనంగా ఇంద్రారెడ్డి జయంతి



దర్గాఖలీజ్‌ఖాన్‌లో ఇంద్రారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్తీక్‌రెడ్డి తదితరులు



పాల్మాకులలో ఇంద్రారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



ఇంద్రారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్తీక్ రెడ్డి తదితరులు

బండ్లగూడ: పేద ప్రజల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు స్వర్గీయ మాజీ మంత్రి ఇంద్రారెడ్డి అని బీఆర్‌ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కార్తీక్‌రెడ్డి అన్నారు. ఇంద్రారెడ్డి జయంతి సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దర్గాఖలీజ్‌ఖాన్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల గుండెల్లో ఇంద్రారెడ్డి చిరస్థాయిగా నిలిచిపోయారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లేందుకు తాను కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు నాగరాజు, కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి, హిమాయత్‌సాగర్ మాజీ సర్పంచ్ ఆంజనేయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ రూరల్..

మాజీ మంత్రి ఇంద్రారెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. పాల్మాకులలో ఉన్న ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కార్తిక్‌రెడ్డి, పాల్మాకుల సొసైటీ చైర్మన్ శ్రవణ్‌కుమార్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గాంధీనగర్‌లో ఇంద్రారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

రాజేంద్రనగర్‌లో..

మాజీ హోంశాఖ మంత్రి ఇంద్రారెడ్డి ఆశయాల కోసం కృషి చేస్తామని బీఆర్‌ఎస్ యువనేత, ఇంద్రారెడ్డి మెమోరియల్ ట్రస్టు చైర్మన్ కార్తీక్ రెడ్డి అన్నారు. శుక్రవారం సర్కిల్ పరిధిలోని డైరీఫామ్ చౌరస్తాలో సీనియర్ నాయకులు సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంద్రారెడ్డి 69వ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ.. ఇంద్రారెడ్డి ఆశయాల కోసం మాజీ మంత్రి, మహేశ్వరం శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజా సంక్షేమం కోసం పోరాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వెంకటేష్, సీనియర్ నాయకులు ధర్మారెడ్డి, నోముల రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వసతుల కల్పనకు కృషి



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న పద్మావతిపాపయ్య యాదవ్

బండ్లగూడ: ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకొని మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతామని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్‌లోని పద్మశ్రీకాలనీ, డాక్టర్స్ కాలనీ, నర్సారెడ్డి కాలనీలో ప్రధాన సమస్యలు డ్రైనేజీ, వాటర్ లైన్, సీసీ రోడ్డు డెవలప్‌మెంట్ పై ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను కలిసి కార్పొరేటర్ పద్మావతిపాపయ్య యాదవ్ సమస్యలను వివరించారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ.. సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉమామహేశ్వర్, మస్తాన్, అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేను పరిశీలించిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టనున్న ఫ్యామిలీ డిటిజల్ కార్డు ద్వారా సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక సులువు అవుతుందని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. మండలంలోని పెద్దతూప్ర తండాలో చేపట్టిన ఇంటింటి సర్వే తీరును శుక్రవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సర్వేలో అధికారులు సేకరిస్తున్న వివరాలను గ్రామస్తులు తెలియజేయాలని ఎమ్మెల్యే సూచించారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఈ తండాను ఎంపిక చేసినట్లు తెలిపారు.



ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్